క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య

కురవి: ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో వివాహిత బానోత్ విజయ(40) శుక్రవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీరోలు ఎస్సై విజయ్‌రాంకుమార్ శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కురవి మండలం నల్లెల్ల శివారు గాజ తండా గ్రామానికి చెందిన బానోత్ విజయ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. అనారోగ్యానికి తోడు ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. దీంతో మనస్తాపానికి గురై శుక్రవారం రాత్రి ఇంట్లో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి భర్త బానోత్ లాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం కోసం మహబూబాబాద్‌లోని జనరల్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

ద్విచక్రవాహనాలు సీజ్

గూడూరు: మండలంలోని బొద్దుగొండ శివారులో శనివారం ఎక్సైజ్ శాఖ సీఐ ఎస్. భిక్షపతి ఆధ్వర్యంలో ఉన్నతాధికారులు ఆదేశం మేరకు వాహనాల తనిఖీ చేశారు. ఈసందర్భంగా ద్విచక్రవాహనాలపై ఇద్దరు వ్యక్తులు 18 లీటర్ల నాటుసారాతో వస్తుండగా వారిని అదుపులోకి తీసుకున్నారు. బొద్దుగొండ శివారు సోమ్లాతండాకు చెందిన వాంకుడోతు నాను, వాంకుడోతు శ్రీనులపై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు సుధాకర్, దేవేందర్, నందకిశోర్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో జీవాల మృతి

మరిపెడ రూరల్: మండలంలోని బాల్నిధర్మారం గ్రామానికి చెందిన గొడి శిరీషకు చెందిన గేదె శనివారం గ్రామ శివారులో గడ్డి మేయడానికి వెళ్లింది. అక్కడ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని బాధిత మహిళ విలపించింది.

కేసముద్రం: మండలంలోని వేంనూర్ శివారు చిన్నకిష్టాపురానికి చెందిన భుక్యా వీరన్నకు చెందిన ఎద్దు అన్నారం గ్రామ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ తీగలకు తాకడంతో శనివారం అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు రూ.70వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వమే తమను ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

కొత్తగూడ: రోడ్డు వెంట నడుచుకుంటు వెళ్తున్న మహిళను ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో మహిళకు గాయాలైన సంఘటన మండలకేంద్రంలో శనివారం జరిగింది. నీలమ్మ తన ఇంటి నుంచి ప్రధాన కూడలికి వెళ్తుండగా నర్సంపేట నుంచి వస్తున్న ద్విచక్రదారుడు ఢీకొట్టాడు. ఈ ఘటనలో నీలమ్మ కాలు విరగడంతో వరంగల్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

బైక్ అదుపు తప్పి ఒకరికి..

దంతాలపల్లి: మండల కేంద్రంలో బైకుపై నుంచి పడి వ్యక్తికి గాయాలైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. మరిపెడ మండలం బుర్హాన్‌పురం గ్రామానికి చెందిన తాటికొండ వెంకన్న తన సొంత పనులపై తొర్రూరుకు వెళ్తున్నాడు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో ఖమ్మం, వరంగల్ జాతీయ రహదారిపై ఉన్న గుంతలో బైకు అదుపు తప్పడంతో పడిపోయాడు. గమనించిన కొంతమంది మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించారు.

వరకట్న వేధింపులపై కేసు

గార్ల: అదనపు కట్నం తీసుకురావాలని తరచూ వేధింపులకు గురి చేస్తున్న భర్త, అత్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.జీనత్‌కుమార్ తెలిపారు. గార్లకు చెందిన సరితకు ఇల్లెందు మండలం కట్టుగూడెం గ్రామానికి చెందిన ఆజ్మీర రవితో 2009 సంవత్సరంలో వివాహం జరిగింది. కొన్నేళ్లపాటు వీరి కాపురం కొన్నేళ్ల పాటు సజావుగానే కొనసాగింది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో 2 సంవత్సరాల నుంచి అదనపు కట్నం తీసుకురావాలని సరితను భర్త రవితో పాటు అత్త రాంబాయి తరచూ వేధింపులకు గురి చేస్తున్నారు. దీంతో విసిగివేసారిన సరిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు భర్త రవి, అత్త రాంబాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శనివారం పేర్కొన్నారు.

నోట్ బుక్‌ల పంపిణీ



మహబూబాబాద్ రూరల్: ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఈదులపూసపల్లి జెడ్పీ హైస్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం పూజారి వీరయ్య అన్నారు. మండలంలోని దర్గతండా ఎంపీపీఎస్ పాఠశాలలో లాక్యతండాకు చెందిన ఇంజనీర్ బానోత్ వినోద్‌కుమార్ రూ.5వేల విలువైన నోట్ బుక్‌లను శనివారం విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజేత, ఉపాధ్యాయుడు శంకర్, సీఆర్పీ వీరన్న, ఖదీర్ పాషా, రమేష్, నరేష్, వీరన్న పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

- మృత్యుకుహరాలుగా రోడ్డుపై గుంతలు
- కత్తిమీద సాములా ప్రయాణం
- ఇటీవల దంతాలపల్లి సమీపంలో ముగ్గురి మృతి
- పట్టించుకోని అధికారులు



నెల్లికుదురు: తొర్రూరు నుంచి మహబూబాబాద్‌కు వెళ్లే రహదారి



దంతాలపల్లి: ఇటీవల ప్రమాదానికి కారణమైన గుంత



నెల్లికుదురు నుంచి కేసముద్రం వెళ్లే రోడ్డు



దంతాలపల్లి: గుంత వద్ద ప్రమాదంలో గాయపడిన విద్యార్థులు (ఫైల్)

దంతాలపల్లి: ప్రతి రోజు ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రజల ప్రాణాలు పోతున్నాయి. రోడ్లు సరిగా లేక గుంతలు ఉండడంతో ప్రమాదాలు జరగుతున్నాయని ప్రయాణికులు, వాహనదారులు ఆర్‌అండ్‌బీ అధికారులను నిలదీస్తున్నారు. మండల కేంద్రంలోని బొడ్లాడ క్రాస్ రోడ్డు నుంచి నర్సింహులపేట మండల సరిహద్దు వరకు సుమారు 8కిలో మీటర్ల మేర జాతీయ రహదారి ఉంది. ఇప్పటి వరకు ఈ రోడ్డుపై గుంతలతో అనేక ప్రమాదాలు జరిగాయి. మండంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో గుంత వద్ద మోటారు వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన బొలేరో వాహనం ఢీకొనడంతో విద్యార్థులకు గాయాలయ్యాయి. మండల కేంద్రం చారితండా సమీపంలో ఇటీవల రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృత్యువాత పడిన విషయం విదితమే. రోడ్డుపై ఉన్న గుంత తప్పించే క్రమంలోనే ఆటో అదుపు తప్పడంతో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే ముగ్గురు మృత్యువాత పడ్డారు.

నెల్లికుదురు: గుంతలమయమైన రహదారులపై ప్రయాణం వాహనదారులకు కత్తిమీద సాములా తయారైంది. మహబూబాబాద్ నుంచి తొర్రూర్ వరకు, నెల్లికుదురు నుంచి కేసముద్రం వెళ్లే రహదారులు గుంతల మయంగా మారి రోడ్డంతా పాడై పోయి డొంక రోడ్లను తలపిస్తున్నాయి. రోడ్లు ఇంత అధ్వానంగా తయారైన పట్టించుకునే వారు కరువయ్యారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాలను అరికట్టాలి



దంతాలపల్లి సమీపంలోని రోడ్డుపై గుంతలను పూడ్చడానికి ఆర్‌అండ్‌బీ అధికారులు సుమారు మూడు నెలల క్రితం పాడైపోయిన తారు తొలగించి వదిలేశారు. కాని ఇప్పటి వరకు గుంతలను పూడ్చలేదు. ఆ గుంతలను పూడ్చినట్లయితే శుక్రవారం ప్రమాదం జరిగేది కాదు. ఇప్పటికైన అధికారులు గుంతలను పూడ్చి రోడ్డు ప్రమాదాలను అరికట్టాలి. - రాజేశ్, వాహనదారుడు, దంతాలపల్లి

ప్రయాణం చేయలేకపోతున్న



రోడ్డు ఇంత అధ్వానంగా పాడైపోయినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. కాళ్లు చేతులు ఉన్నవారు ఈ రోడ్లమీద ఇబ్బంది పడుతూ ప్రయాణం చేస్తుంటే.. కాళ్లు లేని నేను మూడు చక్రాల వాహనంతో ఎలా ప్రయాణం చేయాలి. ప్రభుత్వం రోడ్లకు మరమ్మతులు చేసి ప్రయాణం సాఫీగా సాగేలా చూడాలి.

- చెడుపాక లక్ష్మయ్య, చిన్ననాగారం, నెల్లికుదురు

జూనోసిస్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మరిపెడ రూరల్: జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు సంక్రమించు వ్యాధుల్ని జూనోసిస్ వ్యాధులు (సంక్రమిత వ్యాధులు) అంటారని, జూనోసిస్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మరిపెడ మండల పశువైద్యాధికారి రమేష్ అన్నారు. ప్రపంచ జూనోసిస్ 'డే' సందర్భంగా మండలంలోని ఎడ్జెర్ల పశువైద్యశాలలో 30 పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలను శనివారం వేశారు.



మరిపెడ రూరల్: ఎడ్జెర్లలో శునకాలకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి

మరిపెడ: పశువైద్యశాలలో సుమారు 150 శునకాలకు టీకాలు వేసినట్లు పశువైద్య సంచాలకులు ఎం.కృష్ణమూర్తి తెలిపాడు. శనివారం జూనోసిస్ డే సందర్భంగా విస్తృతంగా ప్రచారం చేయడంతో ఈ రోజు ఎక్కువగా శునకాలు వచ్చాయన్నారు. వ్యాక్సిన్ అందుబాటులో ఉందన్నారు.

డోర్నకల్: స్థానిక పశువైద్యశాలలో శనివారం పశువైద్యాధికారి సురేష్ ఆధ్వర్యంలో శునకాలకు రేబీస్ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్యశాల సిబ్బంది చంద్రయ్య, ఎర్రగడ్డ వెంకన్న, సులేమాన్, పాషా, సంజయ్, రజిని పాల్గొన్నారు.

కురవి: మండల కేంద్రంలోని పశువైద్య శాలలో శనివారం జూనోసిస్ డేను పురస్కరించుకుని 29 శునకాలకు వ్యాక్సిన్ వేశారు. రేబీస్ వ్యాధి రాకుండా ఉండేందుకు వ్యాక్సిన్ వేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. యజమానులకు పలు సూచనలు ఇచ్చారు.



కురవిలో..

కేసముద్రం: మండల కేంద్రంలోని పశువైద్యశాలలో శనివారం 12 కుక్కలకు టీకాలు వేసినట్లు వెటర్నరీ అసిస్టెంట్ మాధురి తెలిపారు.

అసంపూర్తి రోడ్డుతో ప్రజల ఇబ్బందులు



రోడ్డు వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలో అసంపూర్తిగా వదిలేసిన రోడ్డుతో ప్రజలు, వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. అసంపూర్తిగా వదిలేసిన పత్తిపాకరోడ్డును సీపీఐ ఆధ్వర్యంలో శనివారం పరిశీలించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి నిర్లక్ష్యం, బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధుల స్వార్థ ప్రయోజనాల చర్యలతోనే రోడ్డు పనులు నిలిచిపోయాయని ఆరోపించారు. రోడ్డు పనులు ప్రారంభించి రెండు సంవత్సరాలు దాటిన ఎందుకు పూర్తి కాలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, సహాయ కార్యదర్శి రేషలపల్లి నవీన్, జిల్లా కార్యవర్గసభ్యులు చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మీ, నాయకులు పురం భాగ్యమ్మ, నక్క నాగార్జున పాల్గొన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

మహబూబాబాద్ రూరల్: మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలకు వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ అందె మంగక్క పిలుపునిచ్చారు. సంఘం మహాసభ సందర్భంగా మండలంలోని కంబాలపల్లి గ్రామంలో శనివారం భారీ ర్యాలీ జరిపి అనంతరం మహాసభ నిర్వహించారు. పీఓడబ్ల్యూ పట్టణ అధ్యక్షురాలు మంద పద్మక్క అధ్యక్షతన జరిగిన మహాసభలో మంగక్క మాట్లాడుతూ.. రోజురోజుకు సమాజంలో మహిళలపై అత్యాచారాలు పెరుగుతున్నాయన్నారు. వాటిని ప్రభుత్వాలు కట్టడి చేయకపోగా మాదక ద్రవ్యాలు, విచ్చలవిడి మద్యం అమ్మకాలతో యువతను మత్తులో ముంచుతుందని విమర్శించారు. ఈ సభలో సంఘం జిల్లా అధ్యక్షురాలు తిరుపతమ్మ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు బాబన్న, జిల్లా సహాయ కార్యదర్శి యాకూబీ, జిల్లా కోశాధికారి సామ రజిత, జిల్లా అధ్యక్షులు సామ పాపయ్య, పట్టణ కార్యదర్శి కవిత, అనిత, కల్పన, సునీత, అన్నపూర్ణ పాల్గొన్నారు.

పారిశుధ్య లోపంతో విష జ్వరాలు

గార్ల: చిన్నకిష్టాపురం పంచాయతీలో పారిశుధ్యం లోపించడంతో ప్రజలకు విషజ్వరాలు రావడానికి కారకులైన పంచాయతీ కార్యదర్శిని వెంటనే సస్పెండ్ చేయాలని న్యూడెమోక్రసీ పార్టీ మండల కార్యదర్శి జి.సక్రు జిల్లా అధికారులను డిమాండ్ చేశారు. చిన్నకిష్టాపురంలో విషజ్వరాలు సోకిన జ్వరపీడితులను పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి గ్రామాల్లో విషజ్వరాలను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఎడ్జెర్లలో వీధి కుక్కల స్వైరవిహారం

మరిపెడ రూరల్: మండలంలోని ఎడ్జెర్ల గ్రామ పంచాయతీ పరిధిలో వీధి కుక్కల స్వైరవిహారం చేస్తున్నాయి. శుక్రవారం సాయంత్రం గ్రామంలోని మహిళ జంగం పూలమ్మను ఓ పిచ్చి కుక్క ఒక్కసారిగా వచ్చి దాడి చేసి ముక్కు, పెదాలు, ముఖాన్ని తీవ్రంగా గాయపర్చాయి. అదే కుక్క 6 సంవత్సరాల చిన్నారి నారమల్ల దివ్య దాడి చేసింది. చిన్నారి ముక్కు, ముఖంపై గాయాలయ్యాయి. కుక్కల దాడిలో గాయపడ్డ ఇరువురిని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి ఎడ్జెర్లలో మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు చేపట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు.



గాయపడ్డ పూలమ్మ

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సీహెచ్‌సీని పరిశీలిస్తున్న అజయ్‌కుమార్

గూడూరు: వర్షాకాలంలో సంభవించే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, డెంగీ, మలేరియా రాకుండా పరిశుభ్రత పాటించాలని టీవీవీపీ కమిషనర్ డాక్టర్ జె.అజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని సీహెచ్‌సీని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ వీరన్న, డీహెచ్‌క్యూహెచ్ డాక్టర్ బి.వెంకట్రాములు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఆసుపత్రిలోని వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమయానికి అనుకూలం హాజరవుతూ వైద్య సేవలు అందించాలన్నారు. ఆసుపత్రికి అవసరమైన వైద్యులను తొందరలో కొత్తగా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యులు ఎ. రమేష్, లక్ష్మణ్, సీఎస్‌ఎస్ డాక్టర్ ఎస్. స్రవంతి, సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా తరలింపుపై అధికారుల విచారణ

సాక్షి ఎఫెక్ట్..



ఎరువుల గోదాంను తనిఖీ చేస్తున్న అధికారులు

కేసముద్రం: మండల కేంద్రంలోని ధన్నసరి పీఏసీఎస్‌కి చెందిన గోదాం నుంచి శుక్రవారం అక్రమంగా రాయితీ ఎరువుల బస్తాలను తరలించిన ఘటనపై శనివారం ఏఓ వెంకన్న, డీసీఓ ఆఫీస్‌కు చెందిన అసిస్టెంట్ రిజిస్టర్ ఎం.ప్రవీణ్‌కుమార్ విచారణ జరిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ధన్నసరి సొసైటీకి చెందిన గోదాం నుంచి అక్రమంగా ఎరువులను తరలించిన ఘటనపై 'సాక్షి' దినపత్రికలో 'అక్రమంగా రాయితీ ఎరువుల తరలింపు' అనే కథనం ప్రచురితమైంది. ఈ మేరకు ఏఓ, అసిస్టెంట్ రిజిస్టర్‌లు కలిసి కేసముద్రంలోని వెంకటేశ్వర ఎరువుల దుకాణాన్ని, సొసైటీ గోదాంను సందర్శించి విచారణ చేపట్టారు. ఈ మేరకు సొసైటీ గోదాం నుంచి 45 యూరియా బస్తాలను బ్రహ్మంగారితండాకు చెందిన వాంకుడోతు భీకనా అనే వ్యక్తికి చెందిన ఆటోలో వెంకటేశ్వర ఎరువుల దుకాణానికి చెందిన డీలర్ తరలించినట్లు గుర్తించారు. లభ్యమైన 20బస్తాలను సీజ్ చేసి, డీలర్ మదూరి దినేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఓ తెలిపారు. గోదాంలోని సేల్స్ ఇన్‌చార్జ్ ఇనగల సుదీప్‌ను పాలకవర్గం ఆదేశాల మేరకు శాశ్వతంగా విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈఓ మల్లారెడ్డి పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



మహబూబాబాద్: జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆర్డీఓ అలివేలు



డోర్నకల్: నివాళులర్పిస్తున్న నాయకులు

దేశ మాజీ ఉపప్రధాని, సంఘ సంస్కర్త బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటం, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలు పార్టీల, సంఘాల నాయకులు పాల్గొన్నారు. - సాక్షి నెట్‌వర్క్



తొర్రూరులో..

సంక్షిప్త సమాచారం

మార్కెట్ డైరెక్టర్‌గా రమేష్



కొత్తగూడ: నర్సంపేట వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్‌గా కొత్తగూడ మండలం పెగడపల్లి గ్రామానికి చెందిన బొల్లు రమేష్ ఎన్నిక అయ్యారు. ఎన్నికకు కృషి చేసిన మంత్రి సీతక్క, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సన్మానం

దంతాలపల్లి: మండలకేంద్రం జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ పాఠశాలలో చదివి ట్రిబుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థి రాచకొండ జశ్వంత్, విద్యార్థి తల్లిదండ్రులు హేమలత, రామ్మూర్తిలను పాఠశాల ఉపాధ్యాయులు శనివారం ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వేణు మాధవరెడ్డి, ఇన్‌చార్జ్ శ్రీదేవి, సురేంద్రగుప్తా పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచాఓ-బేటీపడాఓ, నూతన చట్టాలపై షీటీంతో అవగాహన శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఓ విజయకుమారి, మహిళా సాధికారత కోఆర్డినేటర్ మహేశ్వరి, జెండర్ స్పెషలిస్ట్ అరుణ, రాకేశ్, అరుణ పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను ఖండించాలి

గూడూరు/బయ్యారం/గంగారం: పాలస్తీనా దేశంపై ఇజ్రాయిల్ ప్రభుత్వం సాగిస్తున్న హత్యాకాండను నిరసిస్తూ మాస్‌లైన్ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా హైదరాబాద్ రాజ్‌భవన్ ముట్టడికి వెళ్తున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) నాయకులను పోలీసులు అరెస్టు చేయడాన్ని ప్రతీ ఒక్కరు ఖండించాలని పార్టీ డివిజన్ నాయకుడు ఈరెల్లి మల్లేష్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడారు.

9న సీత్లా పండుగ జరుపుకోవాలి

కురవి: గోర్ బంజారాల పవిత్రమైన మొట్టమొదటి పర్వదినోత్సవమైన సీత్లా పండుగను ఈనెల 9వ తేదీన నిర్వహించుకోవాలని సేవాలాల్ సేన డోర్నకల్ నియోజకవర్గ నాయకుడు భూక్య నరేష్‌నాయక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

బయ్యారం: బయ్యారంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు శనివారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌సింగ్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ సంతోష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతో గుర్తింపు

మహబూబాబాద్ రూరల్: మండలంలోని మల్యాల ఉమ్మడి గ్రామపంచాయితీ ఎంపీటీసీ బాదావత్ భద్రిచంద్రునాయక్ పదవి విరమణ సందర్భంగా రేగడితండా గ్రామంలో శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మంగిలాల్, నరేష్, హరిలాల్, వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు సన్మానం

గంగారం: గంగారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సువర్ణపాక సరోజన, జెడ్పీటీసీ ఈసం రమ, ఎంపీటీసీల, కోఆప్షన్ సభ్యులకు వీడ్కోలు ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, ఎంపీఓ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చెట్ల తొలగింపు

మహబూబాబాద్: కోనోకార్పస్ చెట్లతో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని ప్రజలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు మున్సిపాలిటీ పరిధిలోని డివైడర్ల మధ్యలో ఉన్న కోనోకార్పస్ చెట్లను శనివారం సిబ్బంది తొలగించగా పనులను మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకన్న పరిశీలించారు. కార్యక్రమంలో పర్యావరణ అధికారి గుజ్జు క్రాంతి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

దుండగులను శిక్షించాలి

మహబూబాబాద్ అర్బన్: తమిళనాడు రాష్ట్రంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్‌ను హత్య చేసిన దుండగులను శిక్షించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు దార్ల శివరాజ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శనివారం ఆర్మ్‌స్ట్రాంగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆర్థికసాయం

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన నద్దునూరి శ్రీను అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి 2000-01 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు రూ.40వేలను అందజేశారు. కార్యక్రమంలో శ్రీరామ్‌చందర్, గండి అశోక్, యాకన్న, సలీం, రాజు, యాకన్న, వీరన్న, శ్రీను, బొల్లోజు శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

తొర్రూరు: ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని జెడ్పీ ఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్ కోరారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆటో డ్రైవర్ బందు మల్లేష్‌కు ఆటో యూనియన్ ఆధ్వర్యంలో శనివారం డివిజన్ కేంద్రంలోని అమరవీరుల స్థూపం ఎదుట నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు మల్లేష్, వెంకన్న, ప్రతాప్, చారి, యాకయ్య, వెంకన్న, ప్రసాద్ పాల్గొన్నారు.

ఏఈఓ నుంచి ఏఈగా..

మరిపెడ/మరిపెడ రూరల్: మరిపెడ మండల కేంద్రానికి చెందిన బాషిద్‌ఖాన్-రేహానాబేగం దంపతుల పెద్దకుమారుడు జావీద్‌ఖాన్ ప్రస్తుతం వ్యవసాయ విస్తరణ అధికారిగా (ఏఈఓ) మండలంలోని బుర్హాన్‌పురం గ్రామంలో విధులు నిర్వహిస్తున్నాడు. ఈక్రమంలోనే గత ఏడాది మే 26న టీఎస్‌పీఎస్‌సీ పరీక్ష నిర్వహించగా ఇటీవల విడుదల చేసిన తుది జాబితాలో ఏఈగా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ అయ్యాడు. తల్లిదండ్రులు జావీద్ ఖాన్‌ను అభినందించారు.

హమ్మయ్య బస్టాండ్‌కు బస్సొచ్చింది

కురవి: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు గ్రామస్తుల విన్నపం మేరకు శనివారం ఆర్టీసీ డిపో మేనేజర్ కె.శివప్రసాద్ చొరవ తీసుకుని ఖమ్మం, సూర్యాపేటకు వచ్చి పోయే వాహనాలను బస్టాండ్‌లోకి వచ్చేలా ఏర్పాట్లు చేశారు. దీంతో హమ్మయ్య బస్సులు బస్టాండ్‌కు వస్తున్నాయని ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆస్పత్రి ఆవరణంతా వాహనాలే..



నెహ్రూసెంటర్: మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణం మొత్తం వాహనాలతో నిండిపోయింది. ఆసుపత్రికి వచ్చే వైద్యులు, రోగులు చూసేందుకు వస్తున్న వారి వాహనాలు, అంబులెన్స్‌లతో ఆసుపత్రి లోపల కిక్కిరిపోయింది. దీంతో ఎమర్జెన్సీ వార్డుకు, స్కానింగ్, ఎక్స్‌రే సెంటర్లు, జనరల్ వార్డులకు వెళ్లేందుకు రోగులు, సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కురవి: మండల కేంద్రంలో నేడు(ఆదివారం) ఉదయం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ శారద శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11కేవీ ఫీడర్‌లో చెట్ల కొమ్మలు తొలగిస్తున్నామని, ఈమేరకు ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

నెహ్రూసెంటర్‌లో..

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని కొత్త బజారులో నేడు విద్యుత్ సరఫరాకు ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ నవ్య తెలిపారు. చెట్ల కొమ్మలను కొట్టడం, ఇతర విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కంకరబోర్డు, ఇందిరాకాలనీ, కృష్ణకాలనీ, సిగ్నల్‌కాలనీ, బ్యాంక్ కాలనీ, ఎన్‌జీఓ కాలనీ, మిర్త్రీకాలనీ, ధర్మన్న కాలనీ, నందమూరినగర్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

మూసి ఉన్న పశువైద్యశాల

అందుబాటులో లేని వైద్య సిబ్బంది



చిన్నగూడూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక పశువైద్య కేంద్రానికి తాళం వేసి మూసి ఉన్నది. పశువైద్యశాలకు పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బంది ఉన్నా శనివారం మాత్రం పశువైద్యశాల మూసి ఉంది. వైద్య సిబ్బంది కూడా అందుబాటులో లేక పోవడం గమనార్హం. మూగ జీవాలను పశువైద్యశాలకు తీసుకు వచ్చినవారు మూసి ఉండడం చూసి వెనుదిరిగి పోయినట్లు స్థానికులు తెలుపుతున్నారు. ఇదే విషయమై మండల పశువైద్యాధికారి లక్ష్మిని 'సాక్షి' చరవాణిలో వివరణ కోరగా మూడు రోజుల ట్రైనింగ్ నిమిత్తం హైదరాబాద్‌లో ఉన్నాను. పశువైద్యశాలలో సిబ్బంది ఉన్నారని తెలిపారు.